క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



కేటీదొడ్డి: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డిని శుక్రవారం వాల్మీకి మండల అధ్యక్షుడు టీచర్ గోవిందు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాసు హనుమంతు, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, సర్పంచు తిక్కన్న, గబ్బర్ వీరన్న, సుధాకర్, కొండన్న, మహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

నెట్టెంపాడు నీటిని విడుదల చేయాలి



కేటీదొడ్డి: మండలంలోని రంగాపురం, మైలగడ్డ, ఉమిత్యాల, కొండాపురం, ఇర్కిచేడు, గువ్వలదిన్నె, పూజారితండా గ్రామాలకు నెట్టెంపాడు నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలో మైలగడ్డ కాలువ రోడ్డుపై వివిధ గ్రామాల రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు రోజుల నుంచి నెట్టెంపాడు 104వ ప్యాకేజీ కాలువ ద్వారా నీరు అందడం లేదని వాపోయారు. తక్షణమే ఎమ్మెల్యే స్పందించి నెట్టెంపాడు కాలువ ద్వారా నీటిని విడుదల చేయించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు నాణ్యతగా చేపట్టాలి



అలంపూర్: అంతర్గత డ్రెయినేజీ పనులు నాణ్యతగా చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. పట్టణంలోని మోమిన్ వాడలో అంతర్గత డ్రెయినేజీ పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలన్నారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జయలక్ష్మి, నాయకులు పెద్దమోక్తార్, శేక్ అహ్మద్, అక్బర్ ఉన్నారు.

శనగలు కొనుగోలు చేయాలి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని కలుగోట్ల పీఏసీఎస్ గోదాంలో పప్పు శనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని రైతు సంఘం సభ్యులు ఎమ్మెల్యే అబ్రహం, కలెక్టర్ వల్లూరు క్రాంతి, మార్క్‌ఫెడ్ డీఎం భాస్కర్ రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలోనే పప్పు శనగలను కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు చిన్న నాగేంద్రం, కొండన్న, రాముకోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, ముత్యాల్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారు అలంపూర్ చౌరస్తాలో అక్రమంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ బాల్‌రాజ్ వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లా పంచలింగాలకు చెందిన ట్రాక్టర్ తుంగభద్ర నది తీరం నుంచి పంట పొలాల మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. పోలీసుల తనిఖీలో అక్రమంగా ఇసుకను తరలిస్తునట్లు గుర్తించారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమాని బోయ రామనాయుడుపై కేసు నమోదు చేశారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత



కేటీదొడ్డి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని గుడికల్ పీఠాధిపతి శ్రీగురు సద్గురు గుడికల్ గాజుహుస్సేన్ స్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గువ్వలదిన్నెలో అల్లిపీరా స్వాముల ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ పిల్లలను చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక చింతన వైపు మళ్లించాలన్నారు. సర్వమతాలు సారాంశం ఒక్కటేనన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయాలు ముస్తాబు



శాంతినగర్ కోయిల్‌దిన్నె రోడ్డులో..



రాజోళిలోని రామలింగేశ్వర స్వామి ఆలయం



అయిజలో మహాశివరాత్రికి ముస్తాబైన గుంత రామలింగేశ్వర స్వామి ఆలయం

రాజోళి: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు ముస్తాబు అయ్యాయి. మండల కేంద్రంలోని భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయంతో పాటు తుంగభద్ర నది మధ్యలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయం, మాన్‌దొడ్డి, పచ్చర్ల, తుమ్మలపల్లె తదితర గ్రామాల్లో శివాలయాలు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

అయిజ: పట్టణంలోని శివాలయాలతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శివాలయాలను శుక్రవారం ముస్తాబు చేశారు. మహాశివరాత్రి ఉత్సవాలకు తరలిరానున్న భక్తులను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతులు కల్పించారు.

మహా శివరాత్రికి సర్వం సిద్ధం

శాంతినగర్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. శాంతినగర్‌లోని రామాలయ వీధిలోని శివాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో వెలసిన స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయం, జూలెకల్ ఆర్డీఎస్ కెనాల్ సమీపంలో మల్లికార్జునస్వామి, కొంకల శివాలయాలు ముస్తాబు అయ్యాయి. స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 6.30 గంటలకు మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, రాత్రి 8 గంటలకు శివరాత్రి జాగరణ, రాత్రి 11 గంటలకు లింగోద్భావ కాలంలో శివుడికి రుద్రాభిషేకం, అర్ధరాత్రి 2 గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణం, మహా మంగళహారతి పూజలు నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా కేసీఆర్ జన్మదినం



గద్వాలలో ఉపాధి ఉద్యోగుల ఆధ్వర్యంలో..



ధరూరులో కేక్ కట్ చేస్తున్న బండ్ల జ్యోతి

గద్వాల న్యూటౌన్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బంది పాలాభిషేకం చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కేక్ కట్ చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్రదానంలో ఉపాధి ఉద్యోగులు పాల్గొని పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ జేఏసీ కన్వీనర్ హుస్సేన్, కోశాధికారి శివజ్యోతిలతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్ స్థానిక నాయకులతో కలిసి బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో కేసీఆర్ పేరుపై అర్చన చేయించి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా కొండేరులో మాజీ ఎంపీ మంద జగన్నాథం నాయకులతో కలిసి తన నివాసంలో కేక్ కట్ చేశారు.

అలంపూర్: పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం, డాక్టర్ వీఎం అజయ్‌లు హాజరయ్యారు. అంతకుముందు ఎమ్మెల్యే జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయం, షా-అలీ-పహిల్వాన్ దర్గా, న్యూప్లాట్స్‌లోని చర్చిలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా నాయకులు కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, సర్పంచు పావని, పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంతో పాటు ఉలిగేపల్లి, అమరవాయి, తాటికుంట, ఎల్కూరు, నాగర్‌దొడ్డి, కుర్తిరావుల చెర్వు గ్రామాలలో నాయకులు సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.

గట్టు: మండల కేంద్రంతో పాటు బల్గెరలో శుక్రవారం సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయుడు, ఎంపీటీసీ రూపవతి, పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా శక్తి కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి హాజరై కేక్‌ను కట్ చేశారు.



అలంపూర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం



బీచుపల్లిలో పూజలు చేస్తున్న గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్



బల్గెరలో కేసీఆర్ జన్మదిన వేడుకలను జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని బీసీ సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో విద్యార్థినులతో పనులు చేయించిన వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హలీమ్ పాషా మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో వార్డెన్లు సమయపాలన పాటించడం లేదని వివరించారు. హాస్టళ్లలోని సమస్యలను విద్యార్థులు బయటకు చెప్పకుండా వార్డెన్లు అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి అధికారులు హాస్టళ్లను పర్యవేక్షించి సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించే విధంగా చూడాలని వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, జమ్మిచేడు కార్తీక్, అంజి తదితరులు ఉన్నారు.

రోడ్లపైనే మురుగు



ధరూరు: మండలంలోని కోతులగిద్దలో రోడ్లపైనే మురుగు ప్రవహిస్తోంది. దీనికి తోడు మిషన్ భగీరథ కులాయి నుంచి తాగునీరు వృథాగా వదలడంతో సమస్య మరింత జఠిలమైంది. గ్రామంలోని ప్రధాన రోడ్లపై పాదచారులు నడవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి, సర్పంచుకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి అధికారులు, పాలకులు చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి



పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): క్రీడల బలోపేతానికి ఎల్లప్పుడు తనవంతు సహకారం అందిస్తానని మండల కేంద్రానికి చెందిన సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు శ్రీహరి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సూగూరులో ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు.

అన్ని రంగాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి

మల్దకల్: అన్ని రంగాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో‌లో భాగంగా శుక్రవారం మండలంలోని మద్దెలబండ, మద్దెలబండ పెద్దతండా, మద్దెలబండ చిన్నతండా గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు అనంతరం రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తానని చెప్పి కేసీఆర్ మాట తప్పారన్నారు. అదే విధంగా తండాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తండావాసులను ద్వారా అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆయా తండాలలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో శంకర్, నారాయణ రెడ్డి, గౌస్, షేక్‌జమాల్, వెంకట్‌రెడ్డి, వెంకటేష్, మాజీద్, వెంకటన్న, బుచ్చిరెడ్డి, ఇలియాస్, రాజేంద్ర, రవినాయుడు, కోటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన

గట్టు: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని బీజేపీ సీనియర్ నాయకుడు సంజీవ్‌భరద్వాజ్ అన్నారు. ప్రజాగోస బీజేపీ భరోసా యాత్రలో భాగంగా శుక్రవారం తుమ్మలచెరువులో స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవ్‌భరద్వాజ్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి బీజేపీ పార్టీని పటిష్టం చేయడానికి కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, నాగప్ప, సిద్దప్ప, రాజప్ప, లోకన్న, కురుమన్న, ఆంజనేయులు, తిమ్మప్ప, గోవిందు, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హామీలు నమ్మొద్దు

రాజోళి: బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద తాండ్రపాడులో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సాధించిన ప్రగతి కంటే అవినీతే ఎక్కువగా ఉందన్నారు. ఉద్యోగాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు పేరుతో ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బీంసేన్‌రావ్, మండల అధ్యక్షుడు సంజీవ రెడ్డి, కాశీనాథ్, వీరేష్, రాఘవేంద్ర, తిరుమలేష్, మహేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి

కొంకల సర్పంచ్ వరలక్ష్మమ్మకు నివాళి



నివాళులు అర్పిస్తున్న మందాజగన్నాథం

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కొంకల సర్పంచ్ బెళగంటి వరలక్ష్మమ్మ(65) గుండెపోటుతో గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న తెలంగాణ ప్రభుత్వ ఢిల్లీలో అధికార ప్రతినిధి డాక్టర్ మందా జగన్నాథం, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సరిత, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు, డాక్టర్ అబ్రహం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా వెంకట్రామిరెడ్డి, చిన్నారెడ్డి, సంపత్‌కుమార్, కోదుమూరు మదనగోపాల్ తదితరులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భర్త మాజీ ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డిని, కుమారులు రాఘువేంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డిలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీలు కాశపోగు రాజు, హన్మంత్‌రెడ్డి, తిరుపతయ్య, చల్లా శ్రీలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాజగోపాల్, బంగిలక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి, ఎనుముల నాగరాజు, మాజీ ఎంపీపీ సుందర్‌రాజు, ప్రహ్లాదరెడ్డి, రామిరెడ్డి, టీడీపీ, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, ఆయా మండలాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ముగిసిన రైతు సంబరాలు



బండలాగుతున్న వృషభరాజాలు

అయిజ: పట్టణంలోని తిక్క వీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన రైతు సంబరాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీనియర్ విభాగం అంతర్రాష్ట్ర వృషభరాజాల బల ప్రదర్శన (బండలాగు పోటీలు) నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 8 జతలు పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా, కొత్తూరుకు చెందిన డాక్టర్ గురునాథరెడ్డి ఎద్దులు 3,902.6 అడుగుల దూరం బండను లాగి ప్రథమ బహుమతి రూ.1,00016లు, హైదరాబాద్‌కు చెందిన జీబీకే రావు ఎద్దులు 3,889.05 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి రూ.70,016లు, జోగుళాంబ గద్వాల జిల్లా పొద్దొడ్డికి చెందిన పైకం లక్ష్మీనారాయణ ఎద్దులు 3,800 దూరం లాగి మూడో బహుమతి రూ. 50,016లు సొంతం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా మూడురాళ్ల పల్లికి చెందిన పులి చిన్న ఓబుల్ రెడ్డి ఎద్దులు 3,740.03 దూరం లాగి నాల్గో బహుమతి రూ.30,016 కై వసం చేసుకున్నాయి. కడప జిల్లా బాలుగారి పల్లికి చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎద్దులు 3,602.04 దూరం లాగి ఐదో బహుమతి రూ. 20,016లు గెలుచుకున్నాయి.

అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయం



పావనంపల్లిలో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య



సుల్తాన్‌పురంలో కంటి వెలుగు ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్‌నాయక్

కేటీదొడ్డి: అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయమని పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుల్తాన్‌పురంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచు రాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, ఏపీఎం అన్నపూర్ణ, సూపర్‌వైజర్ బాలమ్మ, ఏఎన్ఎం సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంతో పాటు పావనంపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాలను శుక్రవారం ఎంపీడీఓ కృష్ణయ్య పరిశీలించారు. కంటి పరీక్షల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌కుమార్, స్వరూపరాణి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని మిట్టదొడ్డి, గంగిమాన్‌దొడ్డి గ్రామాలలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం ఆయా గ్రామాలకు చెందిన 303 మందికి డాక్టర్ కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు తిమ్మప్ప, నరేష్, హుసేన్, మక్బుద్, వెంకటాద్రి నాయుడు, పార్వతి, స్వర్ణలత, విఘ్నేశ్వరీ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని నారాయణపురంలో నిర్వహించిన కంటివెలుగులో 650 మందికి కంటి పరీక్షలు చేసుకున్నారని డాక్టర్ యాకుబ్‌బాషా తెలిపారు. సోమవారం నుంచి కలుకుంట్లలో కంటివెలుగు శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అలంపూర్ రూరల్: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ న్యూప్లాట్స్‌లో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 78 మంది పురుషులు, 89 మంది మహిళలు మొత్తం 167 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. క్యాతూర్ పీహెచ్‌సీలోని లింగన్‌వాయిలో కంటి వైద్య కేంద్రంలో 58 మంది పురుషులు, 83 మంది మహిళలు మొత్తం141 మందికి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. అనంతరం సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా క్యాతూరు పీహెచ్‌సీలో వైద్యాధికారులు మొక్కలు నాటి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసూనరాణి, డాక్టర్ రామస్వామి, లక్ష్మీకాంత్, బాలీశ్వరయ్య, వైద్యా సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

పెబ్బేరు: మైనర్లు బైక్ నడిపితే వారిపై చర్యలు తీసుకుంటామని శుక్రవారం ఎస్ఐ జగదీష్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బైక్ నడుపుతున్న మైనర్లు పట్టుకొని కేసు నమోదు చేయడంతో పాటు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అలాగే మండలంలోని రంగాపూర్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో బైకులు నడుపుతున్న వారికి జరిమానా వేశారు. అనంతరం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో పూలు, పండ్ల బండ్లు రోడ్డుపై పెట్టుకోవడంతో వచ్చిపోయే వాహనాలకు, ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని సూచించారు. రోడ్డుకు దూరంగా బండ్లు ఉంచాలని వారికి అవగాహన కల్పించారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఎన్‌సీడీ కిట్ల పంపిణీ



నారాయణపురంలో ఎన్‌సీడీ కిట్లను అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఉండవెల్లి: మండలంలోని తక్కశిలలో 50 మందికి ఎన్‌సీసీ కిట్లను ఏఎన్ఎం మహేశ్వరి అందజేశారు. శుక్రవారం తక్కశిల గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ ఆధ్వర్యంలో షుగరు, బీపీ ఉన్న వృద్ధులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని నారాయణపురంలో శుక్రవారం డాక్టర్ యాకుబ్‌బాషా ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి ఎన్‌సీడీ కిట్లను పంపిణీ చేశారు. రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులకు ఎన్‌సీడీ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రన్న, మాబమ్మ పాల్గొన్నారు.



ఉండవెల్లి మండలం తక్కశిలలో ..